క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హుజూర్‌నగర్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, నాయకులు కోలపూడి యోహాన్, తేజావత్ రవినాయక్, కంకణాల పుల్లయ్య, కోడి ఉపేందర్, షేక్ సైదా, వల్లపుదాస్ కృష్ణ, సైదులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై నేడు అవగాహన సదస్సు

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురంలో బుధవారం సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరు ధాన్యాలు, ఉత్పత్తులపై ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు, మహిళలు పాల్గొనాలని కోరారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, సింధూరం, తమలపాకు పూజ, శాంతి కల్యాణం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి డ్రైఫ్రూట్స్ (జీడిపప్పు, బాదం, ఖర్జూర, కిస్మిస్) వంటి వాటితో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాక్ శిక్షణ



ఇంటి నిర్మాణంపై శిక్షణ పొందుతున్న భవన నిర్మాణ కార్మికులు

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా గ్రామీణ భవన నిర్మాణ కార్మికులకు వృత్తి నైపుణ్యంపై ఇస్తున్న ప్రత్యేక శిక్షణ కొనసాగుతోంది. 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు వారికి ట్రైనర్ కరుణసాగర్ శిక్షణ ఇస్తున్నారు. 30 మంది కార్మికులు శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు.

21 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

గరిడేపల్లి : క్రిస్మస్ పండుగ సందర్భంగా మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మైదానంలో చే గువేరా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దోసపాటి గణేష్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు దోసపాటి గణేష్ తెలిపారు. క్రీడాకారులు, క్రీడా అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా సహస్ర లింగార్చన



లింగార్చనలో పాల్గొన్న చైర్మన్, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీనల్లకట్ట సంతాన సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సహస్ర లింగార్చనను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, పంచాక్షరి, పంచామృతాలతో అభిషేకం, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాలతో పాటు మట్టితో శివలింగాలు తయారు చేసి కార్తీక దీపోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిమట సైదులు, అర్చకులు గుంటిపల్లి రవీంద్రాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వాగు కష్టాలు తీరేనా



గణపవరం వాగు కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

- గణపవరం వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు
- టెండర్లు పూర్తి చేసిన అధికారులు
- కాంట్రాక్టర్ అలసత్వంతో ప్రారంభం కాని పనులు

మునగాల : మునగాల –గణపవరం గ్రామాల మధ్య గల వాగుపై దశాబ్దాల క్రితం నిర్మించిన కాజ్‌వే పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో వర్షాకాలంలో వాగు ఎగువన చెరువులు నిండుతుండడంతో వరదనీరు వాగులోకి వస్తుండటంతో కాజ్‌వేపై సుమారు ఐదు అడుగుల వరద ప్రవహిస్తుంది. కాజ్‌వే గుంతలమయంగా మారడంతో సుమారు పది గ్రామాల ప్రజలు నరకం చూస్తున్నారు. ఈ కాజ్‌వే మీదుగా మండలంలోని నాలుగు గ్రామాలు, పెన్‌పహాడ్ మండలంలోని ఐదు గ్రామాలు, గరిడేపల్లి మండలంలోని ఐదు గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. భారీ వర్షాలు వస్తే వరదనీరు కాజ్‌వే మీదుగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయిన సంఘటనలు ఉన్నాయి. వరద తాకిడికి సుమారు 50 ఎకరాల్లో వరిపైర్లు పూర్తిగా ధ్వంసం అవుతోంది. కాగా, గత సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు వాగుకు వరద పోటెత్తడంతో సుమారు వారం రోజుల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో నాటి కోదాడ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, ఆనాటి నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వాగు వద్ద పరిస్థితిని పరిశీలించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కానీ నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు.



వరద తాకిడికి దెబ్బతిన్న కాజ్‌వేను పరిశీలిస్తున్న నాటి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)



కాజ్‌వేపై నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు (ఫైల్)

రూ.ఏడు కోట్ల నిధులు మంజూరు

కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సుమారు రూ.7 కోట్లు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఎట్టకేలకు నిర్మాణ పనులకు కాంట్రాక్టు కోసం టెండర్లు ఆహ్వానించింది. టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టరు నేటి వరకు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన బ్రిడ్జి నిర్మించాలని ప్రజల కోరుతున్నారు.

త్వరితగతిన బ్రిడ్జి నిర్మించాలి



గణపవరం వాగుపై ఉన్న కాజ్‌వే స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించే విధంగా సంబంధిత శాఖ అధికారులు సమాయత్తం కావాలి. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ ప్రాంత ప్రజల బ్రిడ్జి నిర్మాణం కలను నెరవేర్చాలి. లేనియెడల ఈ ప్రాంత ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

– మేదరమెట్ల వెంకటేశ్వరరావు,
సీపీఎం నాయకుడు, కొక్కిరేణి

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు



ప్రతియేటా వర్షాకాలం వచ్చిందంటే గణపవరం శివారులో ఉన్న వాగుకు వరద తాకిడి తగలడంతో కాజ్‌వేపై ఐదు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తుంటుంది. దీంతో మా గ్రామంతో పాటు పది గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోతాయి. ఇకనైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించాలి.

– కేతిరెడ్డి మోహన్‌రెడ్డి,
కాంగ్రెస్ పార్టీ నాయకుడు, గణపవరం

త్వరలో పనులు ప్రారంభిస్తాం

గణపవరం శివారులో గల వాగుపై ఉన్న కాజ్‌వేపై నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్‌ను ఎంపిక చేశాం. ఏడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించే ఈ బ్రిడి నిర్మాణ పనులు ప్రస్తుతం కాంట్రాక్టర్ అలసత్వం వల్ల ప్రారంభం కాలేదు. వీలైనంత త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాం.

– బి.సత్యనారాయణ,
ఆర్‌అండ్‌బీ ఏఈ, మునగాల

శ్రీనివాస్ ఆశయ సాధనకు కృషిచేయాలి



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గన్నా చంద్రశేఖర్, సీపీఐ నాయకులు

చిలుకూరు : సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ అమరజీవి పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం చిలుకూరులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీనివాస్‌యాదవ్ మరణంతో సీపీఐ శక్తివంతమైన నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి ప్రజాసమస్యలపై ప్రశ్నించేతత్వము, సత్తా కేవలం సీపీఐ పార్టీకే ఉందన్నారు. రైతాంగ సాయుధ పోరాటం నుంచి ప్రజాసమస్యలపై నిత్యం పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న సత్తా కమ్యూనిస్టులకే ఉందని అన్నారు. ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన చిలుకూరు మండలం చాలా చైతన్యవంతమైనదని అన్నారు. ఆ చైతన్యంతో ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ చిత్రపటానికి ఆయన భార్య కళావతి, పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ పేరుతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆయన వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముందు పార్టీ జెండాను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ కార్యదర్శులు సాహెబ్ అలీ, చిలువేరు అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దాడులు చేసేవారికి బుద్ధి చెబుతా



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : విచక్షణ కోల్పోయి వ్యక్తిగత దాడులు చేసేవారికి తగిన బుద్ధి చెబుతామని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ బీఆర్‌ఎస్ జెడ్పీటీసీ, ఎంపీటీసీలను హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం అనంతరం జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, వైస్ ఎంపీపీ సింగతల సైదమ్మ, ఎంపీటీసీలు చీకూరి రాజారావు, కాశమ్మలు తనపై చేసిన అభియోగం, నిరాధారమైన ఆరోపణలను ఖండించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో విచక్షణ కొల్పోయి వారు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మండలంలోని సమస్యలపై సర్వసభ్య సమావేశంలో చర్చ జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అధికారులు, పోలీసులను అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలు చేయడంతో పాటు తనను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఎంపీటీసీలు పనులు చేశామనడంలో అర్థం లేదని, పనులు చేయకుండా ప్రజాప్రతినిధుల తీర్మాణం, ప్రొసిడింగ్ కాపీ లేకుండా అధికారులను అడ్డం పెట్టుకొని తనను బిల్లులపై సంతకం పెట్టాలని ఒత్తిడి చేశారని, చేయని పనులకు తాను సంతకం చేయలేదని తెలిపారు. సభా సాంప్రదాయం ప్రకారం సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధులు సమావేశ రిజిస్టర్‌లో సంతకం పెట్టి హాజరు కావాలని లేకపోతే సమావేశానికి వచ్చే అర్హత ఉండదన్నారు. సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధులతో సంతకం చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీనియర్ అసిస్టెంట్ పోరెడ్డి చంద్రకళపై చర్య తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ తెలిపారు.

జీడీఎస్‌ల డిమాండ్లు నెరవేర్చాలి



సమ్మెలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

హుజూర్‌నగర్ : గ్రామీణ డాక్ సేవకుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని మెయిల్ ఓవర్సీస్ కోటయ్య కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని తపాలా కార్యాలయం వద్ద జీడీఎస్‌లు చేపట్టిన సమ్మె శిబిరాన్ని మధ్యాహ్న భోజన విరామ సమయంలో సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవకులకు 8 గంటల పనితో పాటు పెన్షన్ ప్రయోజనాలు అమలు చేయాలని అన్నారు. పెయిడ్ లీవ్‌ను 180 రోజుల దాకా నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని కోరారు. జీడీఎస్ ఉద్యోగులపై టార్గెట్ రూపంలో వేధింపులు ఆపివేయాలని డిమాండ్ చేశారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫారసు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మగత, గోపి, అజిత, లక్ష్మి, తిరుపతమ్మ, రాము, గీతాంజలి, వెంకటేశ్వర్లు, శ్యామ్, వెంకటనారాయణ, మహేష్, అభినవ్, రాజు, మహేందర్, నాగు, సత్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసీ అర్చన



లక్ష తులసీ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : కార్తీక మాసం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష తులసీ పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత తులసీ దళాలను మంగళ వాయిద్యాలు, భక్తిగీతాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పూజారులు లక్ష తులసీ దళార్చన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు దశ ఆవర్తనము, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. తదుపరి గోపూజ తీర్థ ప్రసాద వితరణ గావించారు. కాగా, అన్నమయ్య భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో ధర్మకర్తలు, నిర్వాహకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

శివుడికి భస్మాభిషేకం



భస్మాభిషేకంలో పాల్గొన్న నిర్వాహకులు

హుజూర్‌నగర్ : కార్తీకమాస అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని శ్రీభీమలింగేశ్వరస్వామి దేవాలయంలో శివునికి భస్మాభిషేకం చేశారు. శ్రీ సాయి వెంకటలక్ష్మి నరసింహ మోడ్రన్ రైస్ మిల్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 111 కిలోల భస్మం, 111 కిలోల మిశ్రి (పటిక)తో రుద్రపారాయణం, పంచసూక్తలతో మహాశివుడికి భస్మాభిషేకం చేశారు. తొలుత ప్రాతః కాలంలో నమక చమక సహిత మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేసి వివిధ పూలతో శివున్ని ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీకమాస చివరి రోజు కావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు అన్న సంతార్పణ గావించారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ, చైర్మన్, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గెలుపులో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకం



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గరిడేపల్లి : పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంలో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బచ్చలకూరి కృష్ణప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, కుక్కడపు మహేష్, మూలగుండ్ల సీతారాంరెడ్డి, గుండు రామాంజీగౌడ్, కటకం రమేష్, బచ్చలకూరి మట్టయ్య, పెండెం శ్రీనివాస్, సందీప్, రాంబాబు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పాలసీ చెక్కు అందజేత

హుజూర్‌నగర్‌రూరల్ : అర్హులైన ప్రతిఒక్కరూ కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా ఇన్సూరెన్స్ పాలసీ చేయించుకోవాలని సీఎస్‌సీ జిల్లా మేనేజర్ చీమ చరణ్ కోరారు. మండల పరిధిలోని బూరుగడ్డలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఈదప్పగంటి రఘు కుటుంబాన్ని ఆయన మంగళవారం పరామర్శించారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా టాటా ఏఐజీ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించుకున్న రఘు తల్లి ఈదప్పగంటి లీలావతికి టాటా ఏఐజీ లైఫ్ ఇన్సూరెన్స్ కోదాడ బ్రాంచ్ మేనేజర్ పోలిశెట్టి సైదులుతో కలిసి రూ.లక్షా 70 వేల విలువ గల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌సీ కేంద్రం నిర్వాహకుడు చిమట సైదులు, మాదుగుల జ్యోతి, నాగలక్ష్మి, క్రిష్ణవేణి, సునిత, నిర్మల, బాధిత కుటుంబసభ్యులు ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న సీఎస్‌సీ జిల్లా మేనేజర్ చీమ చరణ్

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది

నేరేడుచర్ల : అన్ని దానాలకెల్లా అన్నదానం గొప్పదని వాసవీ క్లబ్ డిస్ట్రిక్ క్యాబినేట్ ట్రెజరర్ రాచకొండ విజయలక్ష్మి అన్నారు. కార్తీక మాసం సందర్భంగా మంగళవారం నేరేడుచర్లలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా, పొలిశెట్టి సోమయ్య సతీమణి నాగమ్మతో పాటు లక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటేశ్వర్లు- రేణుక, కొత్త ఆదినారాయణ- అనసూర్యమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, గుండా సత్యనారాయణ- పద్మావతి దంపతుల సహకారంతో 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్‌ల అధ్యక్షులు కొత్త లక్ష్మణ్, వీరేపల్లి శ్రీలతాకోటేశ్వర్‌రావు, డిస్ట్రిక్ సెక్రటరీ రాచకొండ శ్రీనివాస్‌రావు, మహాలక్ష్మి, కందిబండ శ్రీనివాస్, నటరాజ్, గోపాలకృష్ణ, కిషన్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, సైదయ్య, కోటేశ్వర్‌రావు, అశోక్, పరమేశం, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

చిలుకూరు : ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని తహసీల్దార్ సరిత అన్నారు. మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం తహసీల్దార్ కార్యాయల సీనియర్ అసిస్టెంట్ చావా శైలజ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఆర్ఐ మంజుల, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీను, ఆలయ పూజారి రజనీకాంత్ ఆచార్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిధానంలో..

కోదాడ రూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి శ్రీనివాసనాయుడు అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప మాలధారులకు మంగళవారం దాత చాగంటి ప్రియాంక కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చిలుకూరు ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నదాన నిర్వాహకులు గాలి శ్రీనివాసనాయుడు, గడ్డం సూర్యారెడ్డి, బర్మావత్ సీతారామ్‌సింగ్, నాగరాజు, పవన్, రంగా, తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, ప్రజాప్రతినిధులు

హరిహరసుత అయ్యప్ప దేవాలయంలో..

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం దాతల సహకారంతో అయ్యప్ప మాలధారులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. అన్నదానానికి మండల కేంద్రానికి చెందిన గాయం శ్రీనివాసరెడ్డి –శిల్ప దంపతులు రూ.ఐదు వేలు ఉప్పుల జానకిరెడ్డి –రజిత దంపతులు రూ.ఐదు వేలు, పెంటకొట్ల సురేష్‌స్వామి భక్తపీఠం స్వాములు రూ.ఐదువేలు, చిలుకూరు మండలం ఆచార్యులగూడెం గ్రామానికి చెందిన అందె ఫణింద్ర రూ.వేయి విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్ల సురేష్‌స్వామి, వల్లోజు వెంకన్న, బొబ్బిలి సంజీవరెడ్డి, మండవ శేషయ్య, గాయం శ్రీనివాసరెడ్డి, అక్కినేపల్లి శ్రీనివాస్, జల్లా రాంబాబు, జెల్లా పెద్ద వీరస్వామి పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో..

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో గల అభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో పాటు సింధూరంతో అభిషేకం చేశారు. అనంతరం ఆకుపూజ, పుష్పాలంకరణ గావించి మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : అన్నదానం చేస్తున్న దాతలు, నిర్వాహకులు



మునగాలలో అన్నదానం చేస్తున్న దాతలు

అయ్యప్ప ఆలయంలో..

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు దాతల సహకారంతో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కంతేటి గగన్ చౌదరి పుట్టినరోజు సందర్భంగా ఆయన తండ్రి కంతేటి త్రినిల్, ప్రణయసాయి కుటుంబ సభ్యుల దాతృత్వంతో అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో గురుస్వామి రామనాథం, గురుస్వాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కోదాడఅర్బన్ : అయ్యప్ప దేవాలయంలో అన్నదాన దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కోదాడఅర్బన్ : ఆంజనేయస్వామి ఆలయంలో..



కోదాడరూరల్ : అయ్యప్ప సన్నిధానంలో..

ప్రమాదాలకు కేంద్రంగా చాకిరాల కూడలి



చాకిరాల వద్ద ప్రమాదకరంగా ఉన్న కూడలి

నడిగూడెం : మండలంలోని చాకిరాల గ్రామం వద్ద నాలుగు రహదారులను కలిపే కూడలి ప్రమాదాలకు కేంద్రంగా మారింది. పాత చాకిరాల గ్రామం నుంచి రామాపురంనకు వెళ్లే రహదారి, కొత్త చాకిరాల నుంచి నడిగూడెంనకు వెళ్లే రహదారి ఒకే చోట ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏవైపు నుంచి వాహనాలు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో నిత్యం ద్విచక్రవాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడ రామాపురం వెళ్లే రహదారిపై మాత్రమే ఓ స్పీడ్ బ్రేకర్ ఉన్నది. మిగతా మూడు వైపులకు లేదు. అలాగే ఎలాంటి ప్రమాద హెచ్చరికల బోర్డులు కూడా లేదు. సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

గరిడేపల్లి : మండలంలో విలేకరుల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని ప్రెస్ క్లబ్ నూతన మండల అధ్యక్షుడు కొండా సైదులుగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎల్లావుల వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం వారు గరిడేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత నాలుగు ఏళ్లుగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా తనను ఎంపిక చేయడం పట్ల ఆయన మండల విలేకరులకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమస్యలను త్వరలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

దేశంలోనే ఆదర్శంగా తెలంగాణ

సూర్యాపేట : దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ఆదర్శంగా చేశారని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగులాంబ నుంచి అలంపూర్ వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓటమి పాలైనప్పటికీ సూర్యాపేట మాత్రం బొబ్రాయిగా నిలిచి గెలిచిందని అన్నారు. కేసీఆర్ నాయకత్వం లేని తెలంగాణను ప్రజలు ఊహించుకోలేకపోతున్నారని అన్నారు. మళ్లీ ఎన్నికల వరకు ఒక్కటి లేకుండా అన్ని గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.